క్రాక్

శ్రీ తెన్నేటి సూరి

"క్రాక్—"

"యాటం బాంబు విసిరారూ? —"

కోపంగా చిరునవ్వు నవ్వాడు వెంకటి.

నిజంలే; ఈ సంయుక్తాక్షరాన్ని యెవడు నిర్మించాడోగాని - ఈ బాంబు విసిరితే ఏ మౌంటు ఎవరెస్టయినా ఇట్టే ధ్వంస మయిపోతుంది. పైగా దీని రహస్యం ప్రతివాడికీ తెలుసు; అదీ ప్రమాదం. కాల మాన పరిస్థితులతో నిమిత్తంలేకుండా ఏ లక్ష్యంమీదనైనా, ఏ క్షణానైనా, ఎంత దూరంనుంచిబడితే అంతదూరంనుంచి, ఏ నస్మరంతైనా విసిరెయ్యొచ్చు

"అసలు ఆ మాటంటే మీకింత పొడుచుకొస్తుందనుకోలేదు" అన్నాడు సాహిత్య పీఠాధిపతి.

"మీరేదో కావ్యం వ్రాశానూ, వినిపిస్తామూ అంటే వచ్చాంగాని - వ్యక్తుల పరోక్షంలో వాళ్ళనిగురించి మీరు దుష్ప్రచారం చేస్తూంటే, అది వింటానికి రాలేదు" అన్నాడు వెంకటి.

"దుష్ప్రచారమేమిటి? — ఏ వ్యక్తి గురించైనా నా యిష్టమొచ్చిన అభిప్రాయాన్ని కలిగివుంటానికి నాకు సర్వస్వాతంత్ర్యం వుంది."

"వుంది; కాని ఆ అభిప్రాయాన్ని ఇతరులకు అందజేసేటప్పుడు మట్టుకు తగిన నిదర్శనాలూ నిరూపించుకో వలసిన బాధ్యతా వుంటుంది."

"ఆమాత్రం బాధ్యతలు తెలియని వాణ్ణి గాను లెండి; నిదర్శనాలూ వున్నాయ్."—

"వుంటే చూపండి."

పీఠాధిపతి, జేబులోనుంచి ఒకచిన్న పుస్తకం బయటికి తీశాడు—

"ఈ మహాగ్రంథం తిలకించండి: గ్రంథ నామధేయం- 'గడ్డిపన.' గడ్డిపన, నాగలికొయ్య, బిచ్చగాడు, కుంటిముండా— బలే కావ్యవస్తువులు.. హెఁ హెఁ హెఁ" అంటూ గుర్రపు సకిలింపులా పెద్దపెట్టున ఒక వెకలినవ్వు నవ్వాడు.

సదస్యులలో కొందరు ఆనవ్వును అందిపుచ్చుకుని యకయక లాడారు.

ఈ ప్రవర్తనను యువకులంతా కంటగించు కున్నారు ముఖాన గంటు బెట్టుకుని కోపంగా కూర్చున్నారు.

"షాహుకారు తన పెళ్లాన్ని జమిందారుకు తార్పట మొక్కటే కావ్యవస్తువుగా పనికి వస్తుందని పీఠంవారి అభిప్రాయమా?" అన్నాడు ఇంకో యువకుడు, కొంచెం పెంకెతనంగా.

మనవాడు దెబ్బకి దెబ్బ తీర్చాడని యువకులంతా కచ్చకొద్దీ నవ్వారు.

"పెద్దాచిన్నా లేకుండా—శాస్త్రిగారివంటి మహాపురుషుల్ని, కుర్రవాళ్ళు, మీరిలా

విమర్శించటం అదేమీ బాగుశ్శేదు." అన్నాడు, 'ఆంధ్రకథా గండపెండేరం' కథానిక రచనలో ఇల్లాంటి మహా రచయిత స్వర్గ మర్త్య పాతాళాల్లో ఇంత వరకు ఎక్కడా పుట్టలేదని శాస్త్రిగారు దేశమంతా డబ్బావాయిస్తూ వుంటారు. ఈయన యింట్లోనే యీ సమావేశం జరుగుతోంది.

"మంచీ చెడ్డాలేకుండా పరోక్షంలో పెద్దమనుష్యుల్ని స్కాండలైజు చెయ్యటము శాస్త్రిగారికీ బాగుశ్శేదు. శాస్త్రి గారిని మీయింటికి పిలిపించి ఇల్లాంటి 'స్కాండల్సు' ప్రచారం చేయించటం, మీకూబాగుశ్శేదు" అన్నాడు వెంకటి.

ఆసభలో వున్న వ్యక్తుల్లో రెండు చీలికలు బయలుదేరాయి. తర్జన భర్జన సాగింది. అంతారసాభాస మయ్యేలా తయారైంది. పీఠాధిపతి గుక్కదిప్పు కొని,

"ఆగండాగండి ; తొందరపడకండి। మాట వరసకన్న దానికి ఇంత గందర గోళమేమిటి? .... ఆగం డాగండి .. తొందరపడకండి" అంటూ సర్దాడు

కొంచెంచల్లబడుతోంది సర్దినట్లేసర్ది మళ్ళా మొదలెట్టాడు

"యువకులు మీరంతా యిందులో యింత కంటగించు కోవలసిందేమీ లేదు. అరుణ అల్లాంటి లేకిమనిషి ; దానికి మనమేం జేస్తాం? - అతను జేస్తున్న పనులు ఆంధ్ర కవిలోకానికే తలవంపుగా వున్నయ్ "

"ఏమిటతనుచేసినతలవంపుపని ?-" వెంకటి నిగ్గదీశాడు.

"ఏమిటా ?....ఈ వెధవ ఎవిమిది పేజీలు చెత్తా, అర్ధణాకి, బికారిలా, ఈ వూరి యీవినింగు మార్కెట్టులో, కవినని పేరుతో, తను స్వయంగా అమ్ముతున్నాడు. కవిజాతి తలెత్తుకు తిరగటానికి చేసే పనులేనాయివి ?-"

"కాదు కాదు।. .కవిజాతి బానిస రచనలు చెయ్యవలసిన అవసరం లేకుండా స్వతంత్రంగా బ్రతకటానికి మార్గం చూపించాడు ; కళ్ళుతెరవండి।" అని కేకబెట్టాడు రామూ.

"కళ్ళు తెరవండి।" అని అరిచారు యువకులంతా.

"సభ ముగింపుచేస్తే బాగుంటుంది; కావ్యపఠన జరిగినా శ్రోతలు వినే మన స్థితిలో లేరు." అన్నాడు కథికుడు.

"బెలబెలా అంతా బయటికి వచే శారు ముఖం కందగడ్డ చేసుకుని పెద్ద పెద్ద అంగలుగా రోడ్డువెంట నడిచి పోతున్నాడు వెంకటి. వెంకటి బావ మరిది సుందరం అతనివెంట అంత తొందరగా నడవలేక పరుగు తియ్య వలసి వస్తోంది.

వెంకటివెంట సుందరం కావ్యపఠన జరుగుతుందేమో విందామని వచ్చాడు. అతను కాశీలో ప్లీడరీ చదువుతున్నాడు. సెలవలకు అక్కగారిని చూచి పోదామని వచ్చాడు అతగాడు ఈ గందర గోళ మంతా చూచి విస్తుపోయాడు. నెమ్మదిగా వెంకటిని పలక రించాడు.

"ఏమిటి బావా ఇదంతా"

"మన సాహిత్య ప్రపంచమోయ్"

"మన సాహిత్య ప్రపంచం।"

"హాఁ .. ఇదే మన సాహిత్య ప్రపంచం కాశీలో గంగవొడ్డున యేదు

స్తున్న వెధవకి నీకిదంతా ఎలాతెలిసేడు స్తుందిలే. మరి?"

"అరుణ సంగతేమిటి బావా?"

"ఇప్పుడు నేను మాట్లాడే స్థితిలో లేను. భోజనాలయాక చెబుతాను"

* * *

భోజనంచేసి బావమరదు లిద్దరూ వెన్నెల్లో కూర్చున్నారు సుందరం అరుణసంగతి చెప్పమని బావగార్ని అడిగాడు వెంకటి ఇలా ప్రారంభించాడు.

అరుణసంగతి అర్థంచేసుకోవాలంటే మన అధునాతన వాఙ్మయ చరిత్రకూడా కొంత తెలుసుకోవాలి.

20 వ శతాబ్దారంభంనుంచి ఒక విప్లవ యుగం ప్రారంభమయింది. యూరపు దేశపు రచయితలంతా విప్లవ కారులుగాతయారయ్యారు సఖముఖాలా విప్లవాలు రేకెత్తించే రచనలు సాగించారు. ప్రతిఫలంగా ఆ యా నిరంకుశ ప్రభుత్వాల చేతుల్లో చాలా చిక్కులు బడ్డారు జైళ్ళలో మ్రగ్గిపోయారు; మాతృభూములనుంచి బహిష్కరించ బడి ద్వీపాంతరవాసశిక్ష ననుభవిస్తూ, భార్యా బిడ్డలకు దూరమై ఎన్నెన్నో అవస్థ లనుభవించారు ఉరికంబాలు యెక్కారు.

1914 లో మొదటి ప్రపంచయుద్ధం వచ్చింది దాంతో అన్ని దేశాల్లోనూ ప్రజాస్వామిక ప్రభుత్వాలేర్పడి ప్రజల కష్టాలు తీరుతాయని ఆశించారు సైన్యాలను సమీకరించుకోటానికి సామ్రాజ్య వాదులు అల్లాంటి ఆశలుకూడా చూపుతూ వచ్చారు. కాని యుద్ధం ముగిసిన తదాది ఎక్కడికక్కడ మరింత ఉచ్చులు బిగుసుకున్నయ్ ఫాసిజం తలెత్తి పిశాచంలా గంగశివాలాడి ప్రజల్ని ఉక్కుపాదాలక్రింద నలిపివేయడం ప్రారంభించింది. రచయితలు ఇంకేమీ చేయలేక పోయారు. ప్రజల తరఫున నోరెత్తిన రచయితనల్లా 'గెలటైన్సులో' తలలు తుంచేశారు. చర్మాలు వొలిచి రోడ్ల మీద ఎండేశారు. దీంతో రచయితల్లో గొప్ప నిస్పృహ, నిరాశ, ఆరంభమయ్యాయి. బ్రతుకదలిస్తే నోరు మూసుకు కూర్చోవలసిన దుస్థితంతా ఏర్పడ్డది. కాని కవైనవాడు తనకున్న ఆవేశాన్ని ఏదోరూపంలో వెళ్ళగ్రక్కకుండా ఆగలేడు. ఆ రకంలో కొన్ని రచనలు బయలుదేరాయి అందులో మొదటిది 'సబ్జక్టివ్ పొయిట్రీ' కవి ఏడుస్తాడు; ఎందుకేడుస్తున్నాడో మాత్రం చెప్పడు. కోప్పడతాడు; ఎవరిమీదో, ఎందుకో చెప్పడు. చెబితే ప్రభుత్వాలు ఊరుకోవుగా మరి.

మరో కొందరు రచయితలుబయలు దేరారు. కవి తనకు కావలసిన ప్రతి అవసరాన్నీ ఒక స్త్రీగా చిత్రించడం, అది తనకు అందకుండా అనంతాకాశంలో ఎగిరి పోతోందని ఒక విరహగీతిక వ్రాసిపారెయ్యడం

ఇక మూడోరకం: ప్రజలను గురించీ, ప్రభుత్వాలను గురించీ, రాజ్యాంగాలను గురించీ యేది మాట్లాడినా చిక్కు వస్తుంది సెక్సును గురించీ దేవుణ్ణి గురించీ మన యిష్టంవచ్చినట్టు వాకోక్క వచ్చు మన జోలికెవ్వరూరారు అందుచేత 'స్త్రీ పురుషవాంఛ'ను తీర్చుకోవడములో ఎన్ని వెకిలి పద్ధతులో రీసెర్చిచేసి

బయటికి తెచ్చారు. ఈపద్ధతుల్ని ఆచరణలో పెట్టుకొని రచయితల్లో నూటికి తొంభైమంది నపుంసకు లయ్యారు. ఆడదంటే వాళ్ళకి భయం. ఆడదాని ముందు పెద్ద 'ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్' దీన్ని సూచించే రచనలు కొన్ని బయలుదేరాయి మచ్చుకి:-

నాయకుడు నాయికతో:—

1. బలిసి కూర్చున్న ప్రేమదేవతవునీవు
   జారుచెక్కిళ్ళ ప్రేమపూజారినేను
2. అందుకోలేని గగన పర్యంకసీమ
   అణి ముత్తెపు చుక్కల రాణివీవు
   తరుణీ! పాతాళలోకంపు టిరుకు సందు
   లోన, కుళ్ళినమురికి కాలువను నేను.

సుందరం హడలి పోయాడు—

"అరే! యేమిటిది బావా! .."

"వ్రాశార్రా బాబూ వ్రాశారు—ఇదంతా కవిత్వంక్రింద చలామణి జేశారు"

"అరి వీళ్ళ టస్సుల్ జెక్కా!"

"ఇంకావుంది వినవోయ్— ఇది ఇంకోరకం కవిత్వం ...దీన్ని "సర్రియలిజం" అంటం కద్దు. మచ్చుకు;

"అమ్మ యేడ్చింది హోరున—
భోరున వర్షం,
వర్షం, వర్షం
మబ్బులు, మబ్బులు
తెల్లమబ్బులు,
తెనాలి వెళ్ళాను
కుక్కవెంట
పాండవులు స్వర్గానికి—
...."

"అరె! ఏమిటిదంతా!" అన్నాడు సుందరం.

"ఇదింతేరా. "సర్రియలిజం"— మనస్సుమీద బుద్ధి కంట్రోలు సాంతం లాకులెత్తేశాం".

"చచ్చాం!"

వెంకటి మళ్ళా మొదలు బెట్టాడు,

"ఇది యూరపియన్ రచయితల గ్రంథం" ఈదౌర్భాగ్యమంతా మనదేశానికి దిగుమతీ అయింది. మనసారస్వతం గూడా ఇదే రూపాన్ని పొందింది.

ఈ రచనలన్నిటినీ పరిశీలించి చూస్తే అట్టడుగున వున్న మానసిక దుస్థితి ఒక్కటే-నైరాశ్యం(డిఫీటిజం)

అరుణ సారస్వత ప్రపంచంలోకి అడుగు బెట్టేప్పటికి మన ఆంధ్ర సారస్వతం ఈ సుడి గుణ్ణంలో తిరుగుతోంది.

అరుణది బందరు, బెజవాడ రైల్వే లైనులో ఒక పల్లెటూరు. అతను ఇక్కడికి వచ్చి కాలేజీలో బియ్యే చదివాడు. అప్పట్లో గుడివాడ హైస్కూల్ నుంచి ఈ కాలేజీకి వచ్చిన విద్యార్థులలోనుంచి, చాలామంది యువ రచయితలు మెరికల్లాంటి వాళ్ళు బయల్దేరారు దాని వెనక చాలా చరిత్ర వుంది. ఇప్పుడది మనకప్రస్తుతం.

అరుణ విద్యార్థి దశలోనే కొన్ని రచనలు చేశాడు. వాటిలో ఒక ప్రత్యేకత కనుపించింది. కాలేజీలో వుండే యువ రచయితలంతా అరుణతో సాహచర్యం కలిగివుండే వాళ్ళు. అరుణ బి. య్యే. ప్యాసయాక యీ వూళ్ళోనే వుండిపోయాడు. అతనొక పాకలో వుండేవాడు. ఆ పాకప్రక్కన వున్న దొడ్లో యెర్రగా విరియ బూసి ఒక కొండ తంగేటి చెట్టు వుండేది. ఆ చెట్టుక్రింద ఊళ్ళోవున్న

యువక రచయితలు కొందరు అరుణను కలుసుకుంటూ వుండే వాళ్ళు. ఒకరి రచనలు ఒకరికిచదివి వినిపించుకుంటూ వుండేవాళ్ళు.

1937 జూన్ 1 వ తేదీన ఇలానే యువకులంతా ఆ చెట్టుక్రింద సమావేశ మయ్యారు. తలోరచనా చదివి వినిపించారు. ఇది బాగుందనీ, అది బాగులేదనీ తలో విధంగా మాట్లాడుకుంటున్నారు అరుణ మౌనంగాకూర్చున్నాడు.

"అరుణ మాట్లాడేం?" అన్నాడు రాము

"ఆలోచిస్తున్నాను" అన్నాడు అరుణ.

ఏమిటీ?"

"ఈరచనలన్నీ వ్యర్థమేమోనని తోస్తోంది"

"అదేమిటి?"

"అసలు రచనలు ఎవరికి? ఎందుకు?-"

"అదేం ప్రశ్న?....ప్రజలకి ప్రజల్ని సంస్కరించటానికి-"

"మీ సమాధానం నాకు నచ్చింది.... కాని మనవాఙ్మయంలో ప్రజలేరీ?"

"అవునుఏరీ!...."అంటూవిస్తుపోయి ఒకళ్ళ ముఖంలోకి ఒకళ్ళు చూసుకొన్నారు. తమతమ కాయితాలు తిరగాబోర్లావేసి చూచుకొంటున్నారు. ఏముంది వటిల్లో?

అరుణ అన్నాడు—

"మన వాఙ్మయం రాజులకుబానిసగా అమ్ముడుబోయి, ప్రజాసేవను విస్మరించింది. యువకులు మీరంతా యీవిషయాన్ని గమనించి తగిన సంస్కృతిని నిర్మించండి. మనజీవితాలూ, విజ్ఞానం చరితార్థ మవుతాయి."

"యువకుల హృదయాలకు నిద్దుర లేచినట్లయింది.

"అవును మనమంతా ప్రజలసమస్యలను తీసుకుని రచనలు దూకించా" అన్నాడు రాము.

"మనమంతా ఒక సంస్థగా యేర్పడి పనిచేస్తే ఇంకా బాగుంటుంది"న్నాడు. ఇంకోయువకుడు.

'మహోదయ పరిషత్' అనేపేరుతో ఒక రచయితల సంస్థయేర్పడ్డది. ఆ సంస్థకు అరుణ కార్యదర్శి ప్రజాసాహిత్య ప్రచారానికి యీయువకులంతా అహోరాత్రులూ పనిచెయ్యటం ప్రారంభించారు.

కాని మనసంఘం బొత్తుగా ఎండ్రుబట్టి మోడువారి పోయింది. అధవా, ఎక్కడన్నా కొంచెం పచ్చివుండి ఎర్రటి చిగురు పొటమరించితే ఆమోడు తనం దాన్ని రెండురోజుల్లో బలవంతాన తన లోకి లయించు కుంటుంది.

మహోదయ పరిషత్ పనిచెయ్యటం సాహిత్య పీఠాధిపత్యంలో బైటాయించి కూర్చున్న కవి గజ గండ పెండేరాల కెవ్వరికీ ఇష్టం లేకపోయింది. కుర్రకుంకలనీ, క్రాక్స్ అనీ, సాహిత్య విధ్వంసకులనీ, సంస్కృతిని మాదిగ మంచం చేస్తున్నారనీ—ఇలా దుష్ప్రచారం ప్రారంభించారు. నిరుత్సాహ పడకుండా యువకులు మాత్రం రచనలు సారించుతూ ముందుకుసాగిపోతూనేవున్నారు.

కాని ఒకపెద్దచిక్కు కనుపించింది. రచనలైతే వీళ్ళు చేస్తారు. కాని వాటిని ప్రజల కందజేయడమెలా?

అప్పట్లో పత్రికలన్నీ ఈ రచనలను బాయ్‌కాట్ చేసేవి. దీనికి అనేక కారణాలున్నాయ్. ఈ రచనలు ప్రచురించుతే పేరులోవున్న కవి గణాలు తమకు రచన లివ్వరేమోనని భయం. ప్రజల హక్కులను వాంఛించే రచనలు ప్రచురించితే ప్రభుత్వం పత్రికల్ని ఆప మంటుంది. జమీందారులవల్ల వచ్చే వర్షాజినాలు మన్నా అవుతాయ్. మరో వైపున సాహిత్య పీఠాధిపతులు పెద్ద పెట్టున ఈ రచయితలమీద దుమారం లేపుకొస్తున్నారు. అంచేత ఈ రచనలు ప్రజామోదాన్ని పొందలేవేమోనని ఒక భయం, వీటినన్నిటినీ తలదన్ని - ఏదో ఒక రంకుపురాణం అచ్చు వెయ్యక పోతే పత్రిక ఖర్చుగాదని ఒక అభిప్రాయం చాలమంది పత్రికాధి పతుల్లో బాగా నాటుకుపోయింది. ఈ భావాన్ని నిర్మూలించటం మాత్రం సాధ్యం గానిపని.

పోనీ పత్రికల్లో కాకపోతే మానే! తామే స్వయంగా ప్రకటించుదామంటే యువకులవద్ద ఉత్సాహ ముందిగాని డబ్బేదీ? పైగా వాళ్ళంతా 30 — 35 డిప్రెషన్‌లో పట్టాలుపుచ్చుకున్న 'కళాబ్రహ్మచారులు' నిరుద్యోగంలో హత మయిపోతున్నారు.

ఈ స్థితిలో యీ సంస్థ యే కార్యక్రమాన్నీ ఆచరణలోకి తేలేకపోయింది. అల్లా అల్లా తంటాలుబడి ఒక కథల సంపుటిఅచ్చువేస్తే పుస్తకాల అమ్మకం? యేజంట్లు గ్రంథాలు అమ్మటంమాత్రం అమ్మేశారుగాని పైకంమాత్రం తామే భ్రమింగేశారు.

ఈ యువకులకు ఏమి చేయటానికీ తోచలేదు. ఒకన్నాడు ఆ కొండతంగేటి చెట్టుక్రింద కూర్చొని మిల్లగుంతాలు ఐడుతున్నారు. అరుణకూడా దించుకు పోయి దిగాలుపడి నిస్పృహగా చెట్టు మొదటి కానుకొని కూర్చున్నాడు.

"మ్చ్! లాభంలేదు"

"హుం! యేంజేస్తాం?"

"డబ్బుండాలిరా!"

"ఈ దేశంలో మంచిపని యేది మొదలెట్టినా కొసకంటా సాగదు. ప్రోత్సాహమేరాందే!"

"జాతీ సాంతం చచ్చిపోయింది. దీనికి చైతన్యం చస్తేరాదు. చచ్చిన గొడ్డు బ్రతకడ మెక్కడన్నాఉందిట్రా!"

"లాభంలేదు"

తలో మూలా కాళ్లు పారజాపేశారు.

"నాన్నా!"

పాకలోనుంచి ఒక స్త్రీకంఠం పిలిచింది.

అరుణ పాదాలు నిస్పృహగా పాకలోకి నడిచినాయి.

పదినిమిషాలపాటు అంతా నిశ్శబ్దం.

* * *

అరుణ చివాల్న పాకలోనుంచి ఉత్సాహంగా బయటికి వచ్చాడు. అతని కనీ నీకల్ చీకటి వెలుగులు జిమ్ముతున్నాయ్.

"మనం అనవసరంగా నిరుత్సాహ పడ్డాం. క్రొత్త కార్యక్రమం ఒకటి ఆచరణలోకి తెచ్చి విజయంతో ముందుకు నడిచి పోతాం"

"ఏమిటది?"

"ఏమిటది?"

"ఏమిటది?"

"ఎవరికివారు 7,8 పేజీలకు మించని ఒక్కొక్క చిన్న రచన చెయ్యండి. దాన్ని ఎవరికి వారు అచ్చు వేయించుకుందాం. అర్థణా ఖరీదు బెట్టి ఎవరికి వారు అమ్ముదాం. ఆడబ్బుతో మళ్ళా మరోరచన అచ్చు వేయించుదాం. ఇలా అనంతంగా పని చెయ్యొచ్చు. ఒకొక్కరు అయిదేసి రూపాయిల పెట్టుబడి సేకరించితేచాలు. అనంతకాల గర్భంలోకి నిర్విఘ్నంగా మన కార్యక్రమాన్ని కొనసాగించుకు పోగలుగుతాం. ఇంతేకాదు ఈ విధానం ద్వారా ప్రజల్లోకి తేలిగ్గా చొచ్చుకు పోగలుగుతాం."

యువకులంతా ఉత్సాహంతో ఎగిరి గంతులేశారు. 'ఇన్‌క్విలాబ్ జిందాబాద్' అని అరుచుకుంటూ అరుణను చుట్టేశారు.

"ఎవర్రాలోపలా ?"

అరుణ, నీరెండలా చిరునవ్వు నవ్వాడు.

"సుబ్బలక్ష్మి !"

"అరె ! ఎప్పుడొచ్చింది ?" అంటూ అంతా బిలబిలా పాకలోకి జొరబడ్డారు. ఒకళ్ళ నొకళ్ళు తోసుకుంటూ.

* * *

"సుబ్బలక్ష్మి యెవరు బావా ?" అన్నాడు సుందరం.

అరుణను ఆంధ్ర సారస్వతానికి హవిస్సుగా అందించిన మహాతల్లి. ఒక పద్మశాలి స్త్రీ. అరుణకు చిన్నతనంలో పాలిచ్చి పెంచింది.

అతన్ని చూడ్డానికి అప్పుడప్పుడు వాళ్ళవూరునుంచి వస్తూవుంటుంది."

★

తెలుగు పిల్లలకు —

తెలుగు పూలు

రచయిత: శ్రీ నార్ల చిరంజీవి

★ ద్వితీయ ముద్రణ : వెలువడింది.

★ ఈసారయినా మీ ప్రతికోసం జాగ్రత్తపడండి!

వెల : మూడణాలు

వివరాలకు :—

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం, బెజవాడ.